# ల్యాదెళ్ళ రాజు మృతదేహానికి రీ-పోస్టుమార్టం చేయాలి

## మంద కుమార్ మాదిగ డిమాండ్










**వరంగల్/ గీసుకొండ 25 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గొర్రెకుంటకు చెందిన ల్యాదెళ్ళ రాజు (46) మృతిపై సమగ్ర విచారణ జరిపి, ఆయన మృతదేహానికి వెంటనే రీ-పోస్టుమార్టం నిర్వహించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంద కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గీసుకొండ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరు 19న జరిగిన రాజు మరణాన్ని పోలీసులు కావాలనే గుండెపోటుగా చిత్రీకరిస్తూ కేసును నీరుగారుస్తున్నారని ఆరోపించారు. మృతుడి ఒంటిపై మెడ, నుదురు, తల, తొడలపై బలమైన గాయాలు ఉన్నాయని.కొందరు వ్యక్తులు ఆయన్ను బలవంతంగా కొట్టి చంపినట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ప్రత్యేక దర్యాప్తు అధికారి, పరకాల ఏసీపీ సతీష్ బాబు, గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ మాత్రం ముళ్ళ పొదల్లో పడడం వల్ల, చీమలు కుట్టడం వల్లే గాయాలయ్యాయని బుకాయించడం దుర్మార్గామన్నారు. అగ్రవర్ణాలకు, నిందితులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గుండెపోటు వస్తే ఒంటిపై ఇన్ని గాయాలు ఎలా అవుతాయో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకే కాకతీయ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ రిపోర్టులను సాకుగా చూపుతున్నారని విమర్శించారు. బాధితులు ఇప్పటికే ఎస్సీ కమిషన్‌ను, హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. వరంగల్ సీపీ తక్షణమే స్పందించి, రీ-పోస్టుమార్టం జరిపించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని మంద కుమార్ మాదిగ హెచ్చరించారు.

### హైకోర్టు సిట్టింగ్ జడ్జితో రాజు హత్యపై విచారణ జరిపించాలి.

**ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ**

ల్యాదల్లా రాజు మృతి ముమ్మాటికి రాజకీయ హత్యేనని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు దళిత రత్నా అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ ఆరోపించారు. రాజు రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేకే ప్రత్యర్థులు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని, ఇందుకు ఆయన మృతి చెందిన ప్రాంతమే నిదర్శనమన్నారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితులను త్వరలోనే సమాజం ముందు నిలబెడతామన్నారు. హత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున న్యాయపోరాటం చేస్తామని మహేందర్ స్పష్టం చేశారు.

### నా భర్తను చంపిన వారిపై చర్యలు తీసుకోండి ల్యాదెళ్ళ ప్రియాంక

తన భర్త ల్యాదెళ్ళ రాజు మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన భార్య ప్రియాంక ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తన భర్తది సహజ మరణం కాదని, ప్రత్యర్థులు కొట్టి చంపినట్లు ఒంటిపై స్పష్టమైన గాయాలు ఉన్నాయని కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసును తప్పుదోవ పట్టిస్తూ గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రీ-పోస్టుమార్టం నిర్వహించి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.తమకుతుంబని ప్రభుత్వం తమకుతుంబానికి న్యాయం చేయాలని వేడుకొన్నారు.

### పోలీసుల దర్యాప్తుపై మృతుడి మేనల్లుడి అనుమానాలు

గొర్రెకుంటకు చెందిన ల్యాదెళ్ళ రాజు మృతి కేసులో స్థానిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై మృతుడి మేనల్లుడు హరికృష్ణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన మామ రాజు మృత విచారణ సమయంలో ఎస్సై అనిల్, ఏఎస్సై శ్రీనివాస్ తమపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఘటనా స్థలంలో బలమైన గాయాలు కనిపిస్తున్నా, పోలీసులు ఎవరిని విచారించి ఈ కేసును ముగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితులను విచారించకుండా, కేసును గుండెపోటుగా చిత్రీకరించేందుకే అధికారులు ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి నిజమైన బాధితులను ,నిందితులను విచారించాలని కోరారు.

### రాజు మృతి గుండెపోటా? రాజకీయ హత్యేనా? వీడని మిస్టరీ


ల్యాదెళ్ల రాజు మరణం చుట్టూ ఉన్న అనుమానాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి. పోలీసులు దీనిని సాధారణ, గుండెపోటు గా తేల్చేసి కేసు ముగించినప్పటికీ. బాధితులు మాత్రం ఇది ముమ్మాటికి పథకం ప్రకారం జరిగిన రాజకీయ హత్యే నని బలంగా వాదిస్తున్నారు. రాజు రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేకనే ప్రత్యర్థులు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని, ఆయన మృతి చెందిన ప్రాంతమే ఇందుకు నిదర్శనమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో వైద్యులు గుండెపోటు అని ఎందుకు పేర్కొన్నారు? పంచనామా నివేదికలో అధికారులు ఏం రాశారు? ఉన్నతాధికారులు కావాలనే ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారా? అనే ప్రశ్నలపై ఇప్పుడు తీవ్ర చర్చ జరుగుతోంది. న్యాయం కోసం అప్పటి మంత్రులు, ఉన్నతాధికారులను కలిసినా తమకు న్యాయం చెయ్యలేదని, బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు బాధితులు ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగను కలిసి తమ గోడును వెళ్లబోసుకోగా ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులను ఆయన ఆదేశించారు. గతంలోనూ సాధారణ మరణాలు, గుండెపోటుగా ముద్రపడి క్లోజ్ అయిన ఎన్నో కేసులను మంద కృష్ణ మాదిగ రీ-పోస్టుమార్టం చేయించి, దోషులైన అధికారులను సస్పెండ్ చేయించడమే కాకుండా. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, న్యాయం చేకూర్చిన దాఖలాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని రాజు మరణం కేసు చివరకు ఎటు దారితీస్తుందో, బాధితులకు ఎలాంటి న్యాయం జరుగుతుందో వేచి చూడాలి.






























# చెక్ పవర్‌పై అపోహలకు తెరదించాలి

### ఉప సర్పంచుల మండల ఫోరమ్ విజ్ఞప్తి



**భీమదేవరపల్లి/జూన్25 (జర్నలిస్ట్ వార్త):** చెక్ పవర్‌పై కొనసాగుతున్న అపోహలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరదించి స్పష్టత ఇవ్వాలని భీమదేవరపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఉపసర్పంచుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'హలో ఉపసర్పంచ్ -- చలో హైదరాబాద్' కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపసర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోందని, దీనిపై ప్రభుత్వం వెంటనే అధికారిక ప్రకటన విడుదల చేసి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల నిర్వహణలో ఉపసర్పంచుల పాత్ర కీలకమైందని, వారి అధికారాలను తగ్గించే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.
అలాగే సర్పంచులతో సమానంగా ఉపసర్పంచులకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని, గ్రామాల్లోని వార్డు సభ్యులకు నెలకు రూ.3,000 అలవెన్స్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపసర్పంచుల హక్కులను కాలరాయకుండా చెక్ పవర్ అధికారాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. సర్పంచులతో సమానమైన గౌరవ వేతనం అమలు చేసే వరకు, ఉపసర్పంచుల హక్కులకు పూర్తి రక్షణ కల్పించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ఉపసర్పంచులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

### గిరిజన మహిళ ఖాతా నుంచి డబ్బులు కాజేసిన

# తొట్టి అశోక్ పై కేసు నమోదు.

### -ఎస్ఐ ప్రశాంత్ బాబు.



**బయ్యారం/,జూన్ 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో పే నియర్ యాప్ బ్యాంకు నిర్వాహకుడు తొట్టి అశోక్ వినియోగదారుల ఆధార్ కార్డులతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కాజేసినట్లు పలువురు ఆరోపించిన సంగతి తెలిసిందే.వివరాల్లోకి వెళితే తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారు గుగులోతు రాజిలి గత నెల 5న రామచంద్రపురం పే నియర్ యాప్ మినీబ్యాంకు సెంటర్లో తన ఖాతాలో సొమ్మును పరిశీలించగా మినీ బ్యాంకు నిర్వహకుడు ఖాతాల్లో 11వేలు ఉండగా రూ.7వేలు ఉన్నాయని నమ్మబలికి ఉన్నదాని కంటే తక్కువ చెప్పి 6వేలు ఇచ్చి 4వేలు మినీ బ్యాంకు నిర్వహకుడు తొట్టి అశోక్ ఖాజేశాడని,గతంలో కూడా అనేక సార్లు నా ఖాతానుండి డబ్బులు కాజేశాడని తెలుసుకొని మినీ బ్యాంకు నిర్వాహకుడు తొట్టి అశోక్ పై బాధితురాలు గత నెలలో పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టింది.బాధితురాలి పిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు తొట్టి అశోక్ పై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్ బాబు తెలిపారు.

# ప్రేమ పేరుతో మోసం.. పెళ్లికి నిరాకరణ

### యువకుడిపై కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 25 (జర్నలిస్ట్ వార్త):**
ప్రేమిస్తున్నానంటూ యువతిని నమ్మించి నాలుగేళ్ల పాటు సహజీవనం చేసి, అనంతరం పెళ్లికి నిరాకరించిన యువకుడిపై ధర్మసాగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెగడపెల్లి గ్రామానికి చెందిన వైనాల వెంకటేష్, ధర్మసాగర్ గ్రామానికి చెందిన ఓ మహిళతో గత నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో సన్నిహిత సంబంధాలు కొనసాగించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా దగ్గరయ్యాడని, అయితే ఇటీవల పెళ్లి విషయం ప్రస్తావించగా నిరాకరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ధర్మసాగర్ సీఐ శ్రీధర్‌రావు తెలిపారు.

## కార్మిక గర్జన సభకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఆహ్వానం



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో 25 (జర్నలిస్ట్ వార్త )**భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో జూలై 5న హనుమకొండ జిల్లా మడికొండలోని కరిష్మా గార్డెన్‌లో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల "కార్మిక గర్జన" మహాసభను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, హనుమకొండ జిల్లా కన్వీనర్ కొత్తపల్లి భిక్షపతి, జిల్లా కో-కన్వీనర్ అరూరి అఖిల్ కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కార్మిక గర్జన సభకు హాజరు కావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సభకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కార్మిక సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథం అభినందనీయం

### ఉచిత వైద్య శిబిరం, నిత్యావసరాల పంపిణీలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్





**ఏన్కూర్/, జూన్ 25( జర్నలిస్ట్ వార్త)** సమాజంలోని నిరుపేదలు, గిరిజనులకు వైద్య సేవలతో పాటు నిత్యావసరాలు అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పేర్కొన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా ఏన్కూర్ మండల కేంద్రంలోని గాయత్రి హాస్పిటల్‌లో 'గాయత్రి హెల్పింగ్ హ్యాండ్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రఖ్యాత గ్రామీణ వైద్యులు కొలిశెట్టి నరేష్--రాజేశ్వరి దంపతులు తమ తండ్రి దివంగత కొలిశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ కూడా పాల్గొని గిరిజనులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ కొత్త మేడిపల్లి గిరిజన గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కొత్త పాఠశాల ఏర్పాటు దిశగా జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తామని, గ్రామానికి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ సేవా భావాన్ని చాటుకుంటున్న డాక్టర్ కొలిశెట్టి నరేష్ సేవలను ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు ప్రత్యేకంగా ప్రశంసించారు.అనంతరం కొలిశెట్టి నరేష్ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని నిర్వహించామని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. శిబిరంలో డాక్టర్ ఆసిఫ్ అలీ, డాక్టర్ కొలిశెట్టి నరేష్ వందలాది మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, జైపాల్, తంబళ్ల సామేలు, గుగులోత్ లచ్చిరాం నాయక్, స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, ముళ్లపాటి సీతారాములు, చింతనబోయిన సీతారాములు, నరేష్ జాదవ్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## సత్తెమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు.



**బయ్యారం/,జూన్ 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం గ్రామపంచాయతి ముస్తాఫనగర్ లోని మంద సత్తెమ్మ (75) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించగా సత్తెమ్మ భౌతికకాయ్యాన్ని మండల కాంగ్రెస్ నాయకులు,మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించి వారి కుటుంబాని అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటి జనార్ధన్,నందగిరి భద్రయ్య, ఎనుగుల రంజిత్,పులి మల్లయ్య,పెద్దబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే ఓటరు సేవలు

### బిఆర్ఎస్ నాయకురాలు స్మితా కోటేష్ గౌడ్

**సికింద్రాబాద్/ జూన్ 25 (జర్నలిస్ట్ వార్త):**
సికింద్రాబాద్ ఎమ్ఆమెల్యే దేశాల మేరకు తార్నాక డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్, బీఎల్ఓ అఖిలతో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. స్థానిక ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేసి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మితా కోటేష్ గౌడ్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకునే వారికి, తప్పుల సవరణలు, మార్పులు చేయించుకోవాలనుకునే వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా చైతన్యపరచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఓటరు వివరాల నమోదు, అప్‌డేట్ ప్రక్రియను ప్రజలకు సులభతరం చేయడంలో ఈ ప్రత్యేక కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



# బయ్యారం వాసి మంచిర్యాలలో హత్య..!

**బయ్యారం/,జూన్ 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలానికి చెందిన బానోత్ లకుపతి( 30) హత్యకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకట్రాంపురం పంచాయతీ పరిధిలోని శోక్లా తండ గ్రామానికి చెందిన మృతుడుకి మండలంలోని రామచంద్రపురానికి చెందిన మహిళతో వివాహం జరుగగా వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని తెలిపారు.భార్య కాపురానికి రాకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా బ్రతుకుతెరువు కోసం హైదరాబాదులో హోటల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు.ఈ మధ్య కాలంలో అతనికి ఇంస్టాగ్రామ్ లో ఓ మహిళ పరిచయమావ్వగా ఆమెతో లకుపతి సహజీవనం సాగిస్తున్నట్లు



గ్రామస్తులు తెలిపారు.ఈ నేపథ్యంలో లకుపతి మంచిర్యాల పట్టణంలో వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది.ఇంస్టాగ్రామ్ పరిచయమైన మహిళ కు ఓ మైనర్ బాలిక (14) ఉంది.వారి ఇద్దరికీ మగ దిక్కు,



లేకపోవడంతో గత కొన్ని రోజులుగా ముగ్గురు యువకులు ప్రేమ పేరుతో మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేదిస్తున్నట్లు లకుపతికి తెలిపారు.అ ముగ్గురు యువకులను మందలించి వారిపై చేయి చేసుకోవడంతో వారు మద్యం మత్తులో లకుపతిని ఎలాగైనా అడ్డు తొలగించాలని,కక్ష పూరితంగా పథకం పన్ని విచక్షణా రహితంగా గాయపరిచి హత్య చేసినట్లు మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకొని సంఘటన ప్రాంతానికి కుటుంబ సభ్యులు వెళ్లి వివరాలు తెలుసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి గురువారం తరలించినట్లు వారు తెలిపారు.ఇంస్టాగ్రామ్ లో పరిచయమై ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా మారాలని అనుకున్న అతడు వారి కుటుంబ తగాదాలలో తలదూర్చి ప్రాణాల పోగొట్టుకున్నట్లు స్థానికులు తెలిపారు.ఈ నేపథ్యంలో మృతుడి భార్య,పిల్లలు అనాధలుగా మారారని స్థానికులు తెలిపారు.దీనితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఒంటరి జీవితాలు సోషల్ మీడియా పరిచయాలు ఎంతటి దారుణానికి వడిగడతాయో శోక్లాతండ సంఘటనతో పలువురికి చర్చనీయాంశంగా మారింది.

## కొత్తగా పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు

# రైతు భరోసాకు అప్లై చేసుకోండి.

### -మండల వ్యవసాయ అధికారి కే.రాజు.

**బయ్యారం/,జూన్ 25.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల వ్యాప్తంగా భరోసా పథకం కోసం నూతనంగా జూన్ 15 లోపు భూ భారతి ఆధారంగా ఎవరికైతే పట్టా పాస్ బుక్ వచ్చాయో అ రైతులు వారు క్రింది పత్రాలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమర్పించాని మండల వ్యవసాయ అధికారి కే.రాజు తెలిపారు..పట్టాదారు పాస్ పుస్తకం,ఆధార్ కార్డు,బ్యాంక్ ఖాతా పాస్‌బుక్/చెక్ లీఫ్ జిరాక్స్,దరఖాస్తు పత్రం,బ్యాంక్ ఖాతా వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తు ఫారంతో జులై 5 వరకు వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం,మీ క్లస్టర్ రైతు వేదికలో సంబంధిత పత్రాలను చివరి తేదీ లోగా సమర్పించగలన్నారు.

